RNI:TS-28-0030298

తెలంగాణ డైలీ న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 267 శుక్రవారం, అక్టోబర్ 16, 2026 , పేజీలు - 06 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

పైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి



- సింగరేణిని పైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ
- గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ


హైదరాబాద్:సింగరేణి సంస్థను పైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను పైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బ తీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి



హైదరాబాద్:
తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు.సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంల చర్చించనున్నట్లు వెల్లడించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



హనుమకొండ, అక్టోబర్ 15:
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా మడికొండలో వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్‌పర్సన్ సుధారాణి, కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. చరిత్రలోనే ఇంత ముందుగా ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించడం ఇదే తొలిసారని పేర్కొంటూ, దీని వెనుక కాంగ్రెస్ పార్టీ వ్యూహాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు..

పచ్చి దోపిడీ



హైదరాబాద్, అక్టోబర్15:
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అంటూ అభివర్ణించారు. అనుచరులు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు నిబంధనల ఉల్లంఘనలు అని విమర్శించారు. అర్హతలు లేని వారికి కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఆగడాలు ఏమిటని ప్రభుత్వాన్ని ఆమె సూటిగా ప్రశ్నించారు.కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడేవారిని వదిలిపెట్టబోమని కవిత హెచ్చరించారు. తెలంగాణలోనూ మహిళా రైతుల సాధికారత చట్టం తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రైతులకు, రైతు కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా రైతులకు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత తదితర ప్రయోజనాలు అందించాలని రేవంత్ ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు.

ఎల్‌నినో కోవిడ్ లాంటి సంక్షోభం.. రైతులు అప్రమత్తంగా ఉండాలి

- తాగు, సాగునీటితో పాటు విద్యుత్ సమస్య ఎదుర్కోబోతున్నాం : సీఎం రేవంత్ రెడ్డి
- ఎల్‌నినో పరిస్థితులకు అంతా సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.



హైదరాబాద్ :
రాబోయే రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరించారు. ఎల్‌నినో విపత్తు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను వణికిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని హెచ్చరించారు. అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ విని యోగం చరిత్రలో ఎప్పుడూ లేదని, మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

రిజర్వాయర్లు అన్నీ ఖాళీ అయ్యాయి

రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం తక్కువ ఉన్నాయిని, గోదావరి బేసిన్‌లో నీటినిల్వలు 40 శాతం తక్కువ ఉన్నాయని వెల్లడించారు. చలికాలం రాకముందే రిజర్వాయర్లు ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ల నుంచి 24వేల గ్రామాలకు తాగు నీరు అందించాల్సి ఉందని, నీటి కొరత వల్ల 12 లక్షల ఎకరాల పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, హైదరాబాద్‌కు నీరు అందించే జలశయాల్లో కూడా నీరు లేదని వివరించారు.

మార్చిలో ఉండే ఎండలు అక్టోబర్?లోనే

యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని, సగటుపై అదనంగా 5వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగిందని, మార్చిలో ఉండాల్సిన ఎండలు అక్టోబర్‌లోనే ఉన్నాయని తెలిపారు.

అఖిలపక్షాలతో రేపు సమావేశం

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఎల్‌నినోపై సీఎం సలహాదారు రామకృష్ణారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎల్‌నినో పరిస్థితులపై రేపు అఖిలపక్షాలతో తెలంగాణ ప్రభుత్వం చర్చించనుంది.

విజయవాడలో జాతీయ సరస్ మేళా కార్యక్రమం

- ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



విజయవాడ: విజయవాడలో జాతీయ సరస్ మేళా కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం సరస్ మేళాలో స్టాళ్లను పరిశీలించారు. స్టాల్‌లో చీర కొనుగోలు చేసి డిజిటల్ చెల్లింపులు చేశారు. ఉత్పత్తుల ప్రత్యేకతలపై డ్వాక్రా మహిళలను అడిగి తెలుసుకున్నారు. సహజ ఉత్పత్తులు, చేనేత వస్తువులు, హ్యాండీక్రాఫ్ట్స్?లను రాష్ట్రపతి వీక్షించారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, రామ్మోహన్ పాల్గొన్నారు. మధ్యాహ్నం స్వయం సహాయ సంఘాల మహిళలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కలిసి భోజనం చేయనున్నారు. అనంతరం రాష్ట్రపతి దిల్లీకి బయలుదేరనున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనకు 650 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ సరస్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'స్వయం ఏపీ' బ్రాండ్ పేరుతో ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుంది. నేటి నుంచి ఈనెల 31 వరకు 14 రోజులపాటు సరస్ మేళా కార్యక్రమం ఉంటుంది.

సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా

పారిశ్రామికవేత్త రావాలి



విజయవాడ:
విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళా ను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లా డుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలి సారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీ కరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదు ర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియా డారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని ప్రశంసించారు.మహిళా శక్తిని చాటేందుకే విజయవాడలో ఈ మేళాను ఏర్పాటు చేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 650 స్టాళ్లు మహిళల నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఎల్‌నినో, కొవిడ్ లాంటి విపత్తుల కంటే ప్రమాదకరం కాంగ్రెస్ పాలన



హైదరాబాద్ : ప్రజలు, ఉద్యోగులు మీ ఉద్యోగాలు ఊడగోడుతారు చూస్కో రేవంత్ అని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావుఫైర్ అయ్యారు. విద్యుత్ సంక్షోభానికి మీ చేతగానితనమే కారణం అని వారి ఉద్యోగాలు పోతాయని సీఎం మాట్లాడటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు మీరు చేసి, అధికారుల మీద నెపం నెట్టడం సీఎం, మంత్రులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. బొగ్గు నిల్వలు కూడా పెట్టుకోకుండా విద్యుత్ సంక్షోభానికి కారణమైంది మీరు కాదా? అని ప్రశ్నించారు. సమీక్షలు కూడా చేయకుండా, విద్యుత్ రంగాన్ని గాలికి వదిలేసి, కరెంట్ కోతలకు కారణం అయ్యింది మీరేనని గుర్తు చేశారు. ఇప్పుడు నింద మొత్తం అధికారుల మీద వేసి, మీరు సుద్దపూసలా మాట్లాడుతారా? అని మండిపడ్డారు.9 నెలలుగా ఎల్‌నినో ప్రభావం గురించి వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే వచ్చారు. కానీ మీరు మాత్రం మొద్దు నిద్రలో ఉన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు.. ఇప్పుడు నిద్ర లేచి అధికారులను సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారు. నిషేధిత భూముల జాబితాలో తప్పు చేసింది మీ ప్రభుత్వమే. కానీ అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పుడు కరెంట్ సంక్షోభం విషయంలోనూ మా తప్పేం లేదు, అంతా అధికారులదే అన్నట్లు మాట్లాడుతున్నారు. ఎల్‌నినో, కొవిడ్ లాంటి విపత్తు అంటున్నారు. ఈ రెండింటికంటే మించిన విపత్తు మీ పాలన అని ఎందుకు గుర్తించడం లేదు? అధికారుల ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరిస్తున్నావు.. ప్రజలు, అధికారులు నీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకో రేవంత్ అని హితవు పలికారు.

మంచన్ పల్లిలో రైతు క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం

- భారీగా తరలివచ్చిన రైతులు



పూడూర్, అక్టోబర్ 16(తెలంగాణ డైలీ న్యూస్) :
వికారాబాద్ జిల్లా, పూడూర్ మండలం, మంచన్ పల్లి గ్రామంలో అక్షయ్ సాయి సీడ్స్ ప్రై.లి. (హైదరాబాద్) ఆధ్వర్యంలో రైతు క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ?ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి, సేల్స్ ఆఫీసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ... అక్షయ్ సాయి సీడ్స్ వారి పత్తి రకమైన 'అక్షయ్-సింగం333 బిజీ ××' పంటను రైతులు సాగు చేసి అద్భుతమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రతి రైతు ఇలాంటి నాణ్యమైన విత్తనాలను వాడుకుని అధిక లాభాలు పొందాలని పిలుపునిచ్చారు.?ఈ గొలుసుకట్టు రకం పంటను సాగు చేయడం చాలా సంతోషంగా ఉందని, చక్కటి దిగుబడి వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా అక్షయ్ సాయి సీడ్స్ సంస్థ ప్రతినిధులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ... అక్షయ్ సాయి సీడ్స్ వారి పత్తి రకమైన 'అక్షయ్-సింగం333 బిజీ ××' పంటను రైతు పొలంలో పండించగా అద్భుతమైన దిగుబడి వచ్చిందని తెలిపారు. ప్రతి రైతు ఇలాంటి నాణ్యమైన విత్తనాలను ఉపయోగించి అధిక దిగుబడులు, లాభాలు సాధించాలని కోరారు.?ఈ గొలుసుకట్టు రకం పత్తి విత్తనాలను వాడడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ రమేష్ గౌడ్, రాజేష్ పంతులు, కంపెనీ సేల్స్ ఆఫీసర్ లక్ష్మణ్, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

ఆపదలో సీఎంఆర్ఎఫ్ అండ.

- బొంపల్లి బాధితులకు 'సీఎంఆర్ఎఫ్' చెక్కుల అందజేత...



దోమ, అక్టోబర్ 16 (తెలంగాణ డైలీ న్యూస్) : నిరుపేద కుటుంబాలకు అనారోగ్యం వస్తే.. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్న వారికి వైద్య ఖర్చులు పెద్ద భారంగా మారుతున్నాయి. అప్పులు చేసి మరీ చికిత్స చేయించుకోవాల్సిన దుస్థితిలో ఉన్న అలాంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప వరంలా అండగా నిలుస్తోంది. ?దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన పలువురు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కుటుంబంలో సంపాదించే పెద్దవారే అనారోగ్యంపాలై ఇబ్బంది పడుతున్న ఈ పరిస్థితిని గమనించిన కాంగ్రెస్ పార్టీ దోమ మండల అధ్యక్షుడు డి. శాంతు కుమార్, వారి కుటుంబాలకు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. ?పరిగి ఎమ్మెల్యే సహకారంతో బాధితులకు సీఎం సహాయ నిధికి సంబంధించిన ఆర్థిక సాయం చెక్కులు మంజూరు చేయించారు. గురువారం స్వయంగా ఆ చెక్కులను బాధితులకు అందజేసి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ,బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బోయిని రాములు**
- **నీటిని పొదుపుగా వాడాలి -- ప్రత్యామ్నాయ పంటలే శ్రీరామరక్ష**



పరిగి, అక్టోబర్ 16 (తెలంగాణ డైలీ న్యూస్) :
తెలంగాణ రాష్ట్రంలో ముంచుకొస్తున్న ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, కావున జిల్లా ప్రజలు, రైతాంగం ఇప్పటినుండే అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, పరిగి మండలం మాదారం గ్రామ సర్పంచ్ బోయిని రాములు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు ముఖ్యమైన విషయాలను వెల్లడించారు. బోయిని రాములు మాట్లాడిన ముఖ్యాంశాలు, రాష్ట్రంలో వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ?దీనివల్ల రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు అడుగుంటి, తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. కాబట్టి వికారాబాద్ జిల్లాలోని ప్రతీ గ్రామంలో ప్రజలు నీటి బొట్టును కూడా వృథా చేయకుండా చాలా పొదుపుగా వాడుకోవాలి. అనవసరంగా కుళాయిలు వదిలేయడం, వాహనాలు కడగడానికి తాగునీటిని వాడటం లాంటి పనులు మానుకోవాలి. నీటి సంరక్షణలో గ్రామ ప్రజలందరూ ఆయా గ్రామాల సర్పంచులకు, ప్రజాప్రతినిధులకు సంపూర్ణంగా సహకరించాలని రాములు కోరారు.

2. రైతాంగానికి విజ్ఞప్తి -- ఆరుతడి పంటల వైపే మొగ్గు చూపాలి

వ్యవసాయ రంగానికి నీరు అత్యంత కీలకమైనది. కానీ ఎల్ నినో వల్ల బోరు బావుల్లో నీటి మట్టాలు తగ్గిపోయే అవకాశం ఉంది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, ఆదేశాలను రైతులు తప్పనిసరిగా పాటించాలి. ఈ పరిస్థితుల్లో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి (భూమి) సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను పండించాలి.వేరుశనగ, పొద్దు తిరుగుడు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు, ఆవాలు వంటి ఆరుతడి పంటలు వేయడం వల్ల నీరు ఆదా అవ్వడమే కాకుండా రైతులకు మంచి లాభాలు వస్తాయి. నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు వరి వేసి పెట్టుబడులు నష్టపోవద్దని రైతాంగానికి విజ్ఞప్తి చేసిన బోయిని రాములు.

- పంచాయతీ యంత్రాంగం అప్రమత్తం..

జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా సంబంధిత అధికారుల సహకారంతో తమ తమ గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలి. చేతిపంపులు, బోరు బావులకు ముందస్తు మరమ్మతులు నిర్వహించాలి. గ్రామాల్లో నీటి పొదుపుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని బోయిని రాములు తెలిపారు.

- ప్రజల భాగస్వామ్యమే ముఖ్యం..

ప్రభుత్వాలు, అధికారుల ప్రయత్నాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే నీటి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనగలం. నీటిని కాపాడితే.. ఆ నీరే మనల్ని కాపాడుతుంది' అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటినుంచే ప్రతి ఇంట్లో నీటిని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు బోయిని రాములు తెలిపారు.

కొల్లూరులో ఘనంగా భవానీ మాత బోనాల ఉత్సవాలు.



నవాబ్‌పేట, అక్టోబర్ 16 (తెలంగాణ డైలీ న్యూస్) : మహబూబ్ నగర్ జిల్లా నవాబ్‌పేట మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో భవానీ మాత బోనాల ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. గ్రామ ఆచారం ప్రకారం రెండవ రోజు కూడా వేడుకలు వైభవంగా కొనసాగాయి.ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. బంతి పూలతో సుందరంగా అలంకరించిన బోనాలను నెత్తిన ఎత్తుకొని ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి ముడుపులు సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని భక్తులు ప్రార్థించారు. డప్పు చప్పుళ్లతో గ్రామంలో పండుగ వాతావరణం, భక్తిభావం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో కొల్లూరు గ్రామ సర్పంచ్ సేవ్యా నాయక్, గ్రామ పెద్ద సుధీర్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరామ్ నాయక్, మార్కెట్ మాజీ చైర్మన్ వి. చందర్ నాయక్, మాజీ సర్పంచులు జి. రాజు, మం. రాఘవేందర్, ఏ. వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ ఏ. రామ్మోహన్ రెడ్డి, మేటి కృష్ణారెడ్డి, మేటి రఘుపతి రెడ్డి, హైస్కూల్ చైర్మన్ ఎం. నర్సింలు, వాసు యాదవ్, మాజీ ఉపసర్పంచ్ నరసింహా చారి, ఏ. జగన్, డి. జగన్, డప్పు కళాకారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాండూరులో అభివృద్ధి శూన్యం.. అవినీతి, అక్రమాలు, ఘనం

- **బీఆర్ఎస్ సస్పెన్షన్ ప్రచారం నీతిమాలిన చర్య..**
- **వ్యాపారాలు చేసుకోవడానికే తాండూరు వచ్చారా...**
- **తాండూరు పెద్ద ఆసుపత్రి, ఆర్డీవో ఆఫీస్ తరలింపుపై కుట్రలు..**
- **భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం.. మాజీ ఎమ్మెల్యే పైలెట్ ధీమా..**



తాండూరు, అక్టోబర్ 16 (తెలంగాణ డైలీ న్యూస్) :
తాండూరు నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మరియు ఆయన తమ్ముడు తీవ్ర అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ కోట్లకు కోట్లు సొమ్ము చేసుకుంటున్నారని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధిని పూర్తిగా పక్కనబెట్టి, కేవలం తమ సొంత వ్యాపారాలు, అక్రమ దందాల ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పైలట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ. తాండూరులో ప్రస్తుతం అక్రమ వ్యాపారాలు, దందాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఆయన తమ్ముడి కనుసన్నల్లోనే నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు జోరుగా సాగుతోందని విమర్శించారు. ఒక్క ఇసుక అక్రమ రవాణా ద్వారానే ఏకంగా రూ. 20 కోట్లకు పైగా అక్రమంగా సంపాదించారని రోహిత్ రెడ్డి ఆరోపించారు. ఇసుకతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మట్టి దందాల్లో కూడా వీరిద్దరి పాత్ర ప్రత్యక్షంగా ఉందన్నారు. నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కాకుండా, తాండూరును తమ వ్యాపార కేంద్రంగా మార్చుకుని కోట్లకు కోట్లు కూడగట్టుకోవడానికే వారు ఇక్కడికి వచ్చారని ఎద్దేవా చేశారు.

- నీతిమాలిన ప్రచారాన్ని నమ్మవద్దు.. నాపై తప్పుడు ఆరోపణలు

బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసిందంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది అత్యంత నీతిమాలిన చర్య అని పైలట్ రోహిత్ రెడ్డి కొట్టిపారేశారు. రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామనే భయం, ఈర్ష్యతోనే కొందరు కక్షపూరితంగా తనపై ఇటువంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. "నేను పార్టీకి ఎప్పుడూ దూరం కాలేదు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమంలోనూ నిరంతరం పాల్గొంటున్నాను" అని మీడియా ముఖంగా స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని, తిరుగులేని భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

- కోడంగల్‌కు ప్రభుత్వ కార్యాలయాల తరలింపు కుట్ర...

తాండూరు ప్రాముఖ్యతను తగ్గించి, నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కుట్రలు పన్నుతున్నారని రోహిత్ రెడ్డి ఆరోపించారు. తాండూరులోని పెద్ద ఆసుపత్రితో పాటు ఆర్డీవో కార్యాలయాన్ని కూడా కోడంగల్‌కు తరలించేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ కుట్రల వెనుక స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే హస్తం కూడా ఉందన్నారు. తాండూరు అభివృద్ధిని అడ్డుకుంటూ ఇతర ప్రాంతాలకు కార్యాలయాలను తరలించడాన్ని తాండూరు ప్రజలు సహించరని హెచ్చరించారు.

- అభివృద్ధి శూన్యం.. కేసీఆర్ హయాంలోనే నిజమైన సంక్షేమం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా తాండూరులో ఊహించినంత అభివృద్ధి ఎక్కడా జరగలేదని పైలట్ ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లి చూసినా గత పదేళ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, ఈ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిన ఏ ఒక్క కొత్త అభివృద్ధి పని కూడా కనిపించడం లేదని స్పష్టం చేశారు. అభివృద్ధి చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించి తీవ్రంగా వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలో తాండూరును అన్ని విధాలా ఎంతో అభివృద్ధి చేశానని గుర్తుచేశారు.

- రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన ఖాయం

బీఆర్ఎస్ అంటేనే ప్రజల పార్టీ అని, ప్రతి ఒక్కరికి అండగా నిలిచే ఏకైక పార్టీ అని పైలట్ రోహిత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ.. రికార్డుల స్వాధీనం



కామారెడ్డి, అక్టోబర్ 15:
నగర మున్సిపాలిటీలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు కలకలం రేపుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు.. వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు విచారణపై దృష్టి సారించారు. ఈ క్రమంలో గతంలోనూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టగా.. తాజాగా మరోసారి కీలక రికార్డులను స్వాధీనం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా అభివృద్ధి పనులకు సంబంధించిన కొలతల పుస్తకాలు (ఎంబీ రికార్డులు), బిల్లుల చెల్లింపుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలతో మున్సిపాలిటీలోని సంబంధిత విభాగాల్లో చర్చ మొదలైంది.విజిలెన్స్ అధికారులు తాజాగా స్వాధీనం చేసుకున్న ఎంబీ రికార్డులను తదుపరి విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని విజిలెన్స్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను అక్కడ పరిశీలించి.. ఫిర్యాదుల్లోని అంశాలను ధ్రువీకరించే అవకాశం ఉంది.దిలా ఉంటే.. తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు మరో ప్రభుత్వ అధికారి పట్టుబడ్డారు. రంగారెడ్డి జిల్లాలోని కీసర డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌రెడ్డి రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్న క్రమంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు దాడి చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ చేపడుతున్నారు. లంచం డిమాండ్‌కు దారితీసిన పరిస్థితులు, ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే అంశాలపై వివరాలు తెలియాల్సి ఉంది.

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం.. రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!

హైదరాబాద్ :
బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ
నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక
తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు.రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం



చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు.నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులతొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై ఏకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించా రు.ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

ఫిబ్రవరి నాటికి ఎల్‌నినో ప్రభావం తీవ్ర స్థాయికి:



హైదరాబాద్ :తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు.సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.


నర్సాపూర్‌లో ఫుడ్ పాయిజన్.. యువకుడి మృతి



మెదక్ జిల్లా: నర్సాపూర్ ఫుడ్ పాయిజన్ ఘటనలో సాయిరామ్ అనే యువకుడు మృతిచెందాడు. స్థానికంగా ఉన్న వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో ఇటీవల మండి బిర్యానీ తిని అస్వస్థతకు గురైన అతను చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. రెస్టారెంట్‌లో బిర్యానీ తిని మొత్తం 19 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. దీంతో వారిని హుటాహుటిన నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.అయితే, బాధితుల్లో సాయిరామ్(19) పరిస్థితి విషమంగా మారింది. దీంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ యువకుడు తుదిశ్వాస విడిచాడు. మరోవైపు, నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిలో 18 మందికి చికిత్స కొనసాగుతోంది. యువకుడి మృతిపై బాధిత కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సాయిరామ్ మృతికి కారణమైన వారిని కఠిన శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆహార నమూనాలను పరీక్షించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి.

సీడబ్ల్యూసీ ఆమోదించాకే కాళేశ్వరం పునరుద్ధరణ - 'డిజైన్లు, డ్రాయింగ్స్‌ను మరోసారి పరిశీలించండి'

హైదరాబాద్ :కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణపై నిపుణుల కమిటీ కీలక సూచనలు చేసింది. డిజైన్లు, డ్రాయింగ్స్‌ను పరిశీలించి కొన్ని అంశాలను లేవనెత్తింది. ప్రతిపాదిత పనుల అంశాలకు సంబంధించిన అధ్యయనాలను మరోమారు పక్కాగా సరిచూసుకోవాలని సూచించింది. కేంద్ర జలసంఘం ఆమోదం అనంతరమే ముందుకెళ్లాలని తెలిపింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ ప్రక్రియలో కీలకమైన డిజైన్లు, డ్రాయింగ్స్‌ను నిపుణుల కమిటీ పరిశీలించింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ రెండో సమావేశం దిల్లీలో జరిగింది. బ్యారేజీలకు సంబంధించి ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలు, అధ్యయనాల ఫలితాలను కమిటీ పరిశీలించింది. మరమ్మతులకు సంబంధించి చేపట్టిన పరీక్షలు సరిపోతాయా? వాటి ఫలితాలపై ఇంజినీర్లు సంతృప్తిగా ఉన్నారా? అని



ప్రశ్నించింది. దీనికి సమాధానంగా పరీక్షలు సరిపోతాయని ఇంజినీర్లు చెప్పినట్లు తెలిసింది. మరమ్మతుల డిజైన్లలోని కీలక ప్రతిపాదనల గురించి కమిటీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కొన్ని అంశాలను లేవనెత్తింది. సిల్లింగ్ బేస్‌ను విస్తరించడం వల్ల ఏర్పడే జాయింట్‌పై కమిటీ ఆరా తీసింది. ఆ జాయింట్ కారణంగా భవిష్యత్తులో ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉందదా? దాన్ని అధిగమించేందుకు ఎలాంటి విధానాన్ని అనుసరిస్తారు? అని ఇంజినీర్లను ప్రశ్నించింది. అలాగే బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించే ఎనర్జీ డిసిపేషన్ ప్రక్రియను ఎలా చేపడతారనే అంశంపైనా వివరణ కోరింది. పునరుద్ధరణ పనుల్లో ఈ అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. సీకెంట్ పైల్స్ దిగువ నుంచి నీరుబ్యారేజీల పునాదులు, సీకెంట్ పైల్స్‌కు సంబంధించి కమిటీ పలు ప్రశ్నలు సంధించింది. సీకెంట్ పైల్స్ ఎంత లోతు వరకు ఉన్నాయనే విషయాన్ని కచ్చితంగా నిర్ధారించుకు న్నారా? అని అడిగింది. డయాఫ్రమ్ వాల్ నిర్మాణం తర్వాత సీకెంట్ పైల్స్ దిగువ నుంచి నీరు ప్రవహించే అవకాశం ఉందా? లేదా? అన్న విషయాన్ని అధ్యయనం చేశారా? అని ప్రశ్నించింది. స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి అంశాన్ని పక్కాగా నిర్ధారించుకోవాలని పేర్కొన్నట్లు సమాచారం. సీడబ్ల్యూసీ ఆమోదం పొందాకే పునరుద్ధరణ పనులను ప్రారంభించాలని స్పష్టం చేసింది.

ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకే ఐఫోన్ అమాయకుల నుంచి భారీగా నగదు కాజేసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

హైదరాబాద్ : ఎవరైనా మోసపోతే ఏం చేస్తారు? మళ్లీ అలా జరగకుండా జాగ్రత్త పడతారు. కానీ అతను మాత్రం అలా కాదు. తాను మోసపోయిన అనుభవంతోనే ఏకంగా పదుల సంఖ్యలో అమాయకులను బురిడీ కొట్టించాడు. బీటెక్ చదువుకున్న ఆ యువకుడు ఎక్కడికీ వెళ్లకుండా, ఎంచక్కా ఇంట్లోనే కూర్చుని మోసాలకు తెరలేపాడు. ఓఎల్ఎక్స్‌లో ఖరీదైన స్మార్ట్ ఫోన్ కొందామనుకున్న వారి ఆశలను క్యాష్ చేసుకున్నాడు. ఇంతకీ ఎవరా మోసగాడు? ఓఎల్ఎక్స్ వేదికగా వల పన్ని కొనుగోలుదారులు, అమ్మకందారులను ఎలా బురిడీ కొట్టించాడు? అసలు ఇంట్లో నుంచి బయటకు రాకుండానే మోసాలు ఎలా చేశాడు?తక్కువ ధరకు ఖరీదైన ఫోన్లు అమ్ముతానని బురిడీ ఓఎల్ఎక్స్ ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకు ఖరీదైన ఫోన్ వస్తుందని ఎవరైనా ఆశపడి ఫోన్ చేస్తే చాలు ఈ కేటుగాడు వల విసురుతాడు. ఫోన్ కొనే వ్యక్తిని ఓ చోటికి రప్పించి నిజంగా ఫోన్ అమ్మే



మరో వ్యక్తిని అక్కడికే పంపిస్తాడు. తీరా అక్కడ మొబైల్ చూసుకుని, అంతా బాగుందని ఆన్‌లైన్‌లో డబ్బులు పంపగానే అసలు ట్విస్ట్ ఇస్తాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. ఫోన్ తెచ్చిన వ్యక్తేమో తనకు డబ్బులు రాలేదంటూ గొడవకు దిగుతాడు. కాసేపటికి కానీ ఆ ఇద్దరికీ తాము మోసపో యామన్న నిజం అర్థం కాదు. అచ్చం ఇలాంటి స్కెచ్‌లు వేసి ఏకంగా 16 సార్లు మోసం చేశాడు.గతంలో ఓఎల్ఎక్స్ వేదికలో మోసపోయిన శ్రీరామ్‌వరంగల్ వాగ్దేవి కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన శ్రీరామ్ కొన్నాళ్ల పాటు అయ్యప్ప సొసైటీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. అయితే గతంలో ఓఎల్?ఎక్స్?లో ఒక వస్తువు కొనబోయి ఓ సైబర్ నేరగాడి చేతిలో ఇతను మోసపోయాడు. తాను నష్టపోయిన డబ్బును అదే ఓఎల్ఎక్స్ వేదికగా రాబట్టాలని డిసైడ్ అయ్యాడు. అఖిల్, మనోజ్ అనే మారు పేర్లతో చీటింగ్‌కు తెరలేపాడు. తాను ఏ విధంగా అయితే మోసపోయాడో, అచ్చం అదే విధంగా పక్కా స్కెచ్ వేసి మోసాలకు తెరలేపాడు.డబ్బులు వచ్చాక ఫోన్ స్విచ్ఛాఫ్‌శ్రీరామ్ మోసం చేసే విధానం చాలా సింపుల్‌గా ఉంటుంది. గూగుల్ నుంచి ఖరీదైన ఐఫోన్లు, శామ్‌సంగ్ ఫోన్ల ఫోటోలు డౌన్లోడ్ చేసి ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకు అమ్ముతానని యాడ్స్ పెడతాడు. ఎవరైనా కొనేందుకు ఫోన్ చేస్తే కేవలం మధ్యవర్తినని, ఫోన్ అమ్మేది తన సోదరుడని నమ్మిస్తాడు. ఆ తర్వాత నిజంగా ఫోన్ అమ్మే వ్యక్తిని, కొనాలనుకునే వ్యక్తిని ఇద్దరినీ ఒకే చోటికి రప్పిస్తాడు. వాళ్లు ఫోన్ చెక్ చేసుకున్నాక, డబ్బులు మాత్రం తన క్యూఆర్ కోడ్‌కు సెండ్ చేయించుకుంటాడు. ఆ తర్వాత తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుంటాడు.నిందితుడు శ్రీరామ్ ఓఎల్ఎక్స్ ప్రొఫైల్‌లో ఐఫోన్ తక్కువ ధరకే అమ్ముతామని మోసం చేసేవాడు. మొత్తం నాలుగు కమిషనరేట్?లో 4 కేసులు నమోదయ్యాయి. అతడిని మొదటిసారిగా అరెస్టు చేశాం. రిమాండ్‌కు తరలించడం జరుగుతుంది. ప్రజలు ఓఎల్ఎక్స్‌లో ఏదైనా కొనుగోలు చేసే ముందు అప్రమత్తంగా ఉండాలి

చెత్త నిర్వహణకు ఏటా రూ. 1000 కోట్లు - కార్పొరేషన్ అధికారులపై వెల్లువెత్తుతున్న విమర్శలు

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రతిరోజూ 10,000 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. దాని నిర్వహణ కోసం ప్రభుత్వం ఏటా రూ. 1,000 కోట్లు ఖర్చు చేస్తోంది. ఉద్యోగుల జీతాలు మినహాయిస్తే, కేవలం చెత్త రవాణా, నిర్వహణకే రూ. 800 కోట్లు ఖర్చవుతున్నాయి. చెత్తతో సంపద సృష్టిస్తున్న ఈ రోజుల్లో వ్యర్థాల సేకరణ, రవాణా, నిర్వహణపై ఏటా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వికేంద్రీకరణ నమూనాను అందిపుచ్చుకుని చెత్తను కొనుగోలు చేయడానికి చిన్న తరహా పరిశ్రమలు ముందుకు వస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు రాంకీ సంస్థ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.జీతాల చెల్లింపులో జాప్యంఇటీవల పునర్విభజన ప్రక్రియతో గ్రేటర్ హైదరాబాద్ పరిస్థితి మరింత దిగజారింది. ఖజానా ఖాళీగా ఉండటంతో కమిషనర్ ఆర్వి కర్ణన్ సెప్టెంబర్ 1వ తేదీకి బదులుగా 10వ తేదీన ఉద్యోగుల జీతాలు చెల్లించారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పడిన కొత్త కార్పొరేషన్లు ఎంఎంసీ,



సీఎంసీలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సైబరాబాద్ కార్పొరేషన్ ఆస్తి పన్ను రాబడిలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ పారిశుధ్యంపై అది చేస్తున్న ఖర్చులు ఆదాయానికి మించి పెరుగుతున్నాయి.చెత్తే సంపదచెత్తను కాల్చి విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. ఎరువులు తయారు చేయవచ్చు. కాగితం, లోహం, ప్లాస్టిక్?తో పాటు ఇతర పదార్థాలను రీసైక్లింగ్ ద్వారా అమ్ముకోవచ్చు. పనికిరాని వ్యర్థాలను కుప్పలుగా పోస్తే దాని నుంచి పునరుత్పాదక సహజ వాయువు ఉత్పత్తి అవుతుంది. దానిని వాహనాలు నడపడానికి లేదా వంట చేయడానికి ఉపయోగించవచ్చు.

డిస్కంలకు హైకోర్టులో ఊరట



హైదరాబాద్: తెలంగాణ డిస్కంలు ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లకు గత బకాయిల అంశంలో హైకోర్టులో బుధవారం తాత్కాలిక ఊరట లభించింది. తెలంగాణ డిస్కంల నుంచి రూ.24 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంటూ ఏపీలోని ల్యాంకో కొండపల్లి పవర్ లిమిటెడ్.. కేంద్ర విద్యుత్ శాఖ ఆధ్వర్యంలోని 'ప్రాప్తి' పోర్టల్‌లో ఇన్వాయిస్‌లు నమోదు చేసింది. డిస్కంల వినతి మేరకు ఈ ఇన్వాయిస్‌ల అమలుపై హైకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 28కి వాయిదా వేసింది.

ఆ హోటల్ ఆదాయం రోజుకు రూ.75 లక్షలు.. కేటీఆర్‌పై వెంకట్ బల్మూర్ తీవ్ర ఆరోపణ

హైదరాబాద్ :
హోటల్ ఆదాయం రూ.5 కోట్ల నుంచి రూ.175 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్న మంత్రిగా ఎంఎన్సీలను బెదిరించి వ్యాపారం చేశారని ఆరోపణ ఆరోపణలపై చర్చకు సిద్ధమని కేటీఆర్‌కు సవాల్ త్వరలో సిరిసిల్ల బాగోతం కూడా బయటపెడతానన్న బల్మూరి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై శాసనమండలి ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. గతంలో చెప్పినట్టుగానే కేటీఆర్ చీకటి బాగోతాలను వరుసగా బయటపెడుతూనే ఉంటానని, అందులో భాగంగానే ఆయన హోటల్ వ్యాపారానికి సంబంధించిన కొన్ని విషయాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. రూ.5 కోట్ల షేర్ విలువ ఉన్న డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని ఆయన డిమాండ్



చేశారు.ఈ విషయంపై తాను ఆరా తీయగా విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయని బల్మూర్ అన్నారు. కేటీఆర్ ఐటీ మంత్రిగా, షాడో ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బహుళజాతి సంస్థ (వీబీజ)లను బెదిరించి, తమ కంపెనీలకు చెందిన ఫుడ్, ఈవెంట్స్, మీటింగ్స్ వంటివి తన హోటల్‌లోనే నిర్వహించేలా ఒప్పందాలు చేయించుకున్నారని విమర్శించారు. ఈ ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఇది కేటీఆర్, ఆయన టీమ్ చేస్తున్న నయా దందా అని అభివర్ణించారు. ఆ హోటల్ రోజువారీ ఆదాయం సుమారు రూ.75 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.తాను చేసిన ఆరోపణలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని బల్మూర్ స్పష్టం చేశారు. కేటీఆర్‌కు దమ్ముంటే తన ఆరోపణలపై స్పందించాలని సవాల్ విసిరారు. అంతేకాకుండా, త్వరలోనే కేటీఆర్‌కు సంబంధించిన "సిరిసిల్ల చీకటి బాగోతం" కూడా బయటపెడతానని వెంకట్ బల్మూర్ హెచ్చరించారు.

విశాఖకు విమాన సర్వీసుల నిలిపివేత పిల్‌పై జోక్యం చేసుకోలేం

అమరావతి :విశాఖ ఎయిర్‌పోర్ట్ సర్వీసుల నిలిపివేతపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య, సివిల్ విమాన కార్యకలాపాలను నిలిపివేస్తూ, వాటిని కొత్తగా వస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ చేస్తూ కేంద్ర సివిల్ ఏవియేషన్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై జోక్యం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది.ఈ బదిలీని సవాలు చేస్తూ రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావుతో పాటు మరికొందరు దాఖలు చేసిన పిల్ (పిల్?) ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్ లతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. భోగాపురం – విశాఖల మధ్య ఆరు వరుసల జాతీయ రహదారి పూర్తయ్యే వరకైనా విశాఖ నుంచి డొమెస్టిక్ విమానాలను నడిపేలా ఆదేశించాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని కూడా కోర్టు తిరస్కరించింది.

రాకపోకలకు రవాణా సౌకర్యం : భోగాపురం



నుంచి విశాఖపట్నానికి ఆరు వరసల జాతీయ రహదారిని(ఎన్‌హెచ్) పూర్తి చేసే వరకైనా డొమెస్టిక్ విమాన సర్వీసులను విశాఖపట్నం నుంచి నడిపేలా ఆదేశించాలని పిటిషనర్లు చేసిన అభ్యర్థనను సైతం ధర్మాసనం తోసిపుచ్చింది. భోగాపురంలో విమాన రాకపోకల వేళలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను కల్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందని కోర్టు గమనించింది. ఈ నేపథ్యంలో, ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి లీసా గిల్, న్యాయమూర్తి చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని మౌఖికంగా పేర్కొంది.రహదారి పూర్తయ్యే వరకు సేవల కొనసాగింపు : విశాఖపట్నంలో కార్యకలాపాలను నిలిపేసి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ ఈ ఏడాది జులై 28న జారీచేసిన నోటిఫికేషన్?ను సవాలు చేస్తూ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావు, మరో ఇద్దరు హైకోర్టులో పిల్ వేశారు. విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం నామమాత్రంగా ఉందన్నారు. వారి తరఫున న్యాయవాది ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ, విశాఖపట్నం నుంచి భోగాపురం చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది.”విశాఖపట్నం నుంచి దేశీయ విమాన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, కనీసం ఆరు వరుసల జాతీయ రహదారి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఈ సేవలను కొనసాగించాలని” వారు కోరారు. విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుగా రోజుకు 80 ట్రిప్పులు ఆర్టీసీ సర్వీసును నడుపుతున్నామన్నారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని పిల్‌ను కొట్టేయాలని కోరారు.

విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం



విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు.దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

కుప్పంలో వైసీపీకి షాక్.. టీడీపీలోకి భారీగా వలసలు

చిత్తూరు, అక్టోబర్15:



జిల్లాలోని కుప్పంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి పెద్ద సంఖ్యలో శ్రేణులు బై బై చెప్పి.. టీడీపీ కుండువా కప్పుకున్నాయి. గురు వారం అధికార పార్టీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో ఆయా శ్రేణులు టీడీపీలో చేరాయి. కుప్పం మున్సిపల్ వైస్ చైర్మన్ మునుస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విద్యాసాగర్ తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కుండవా కప్పి.. పార్టీలోకి ఆహ్వానించారు.సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి ఆయనతో కలిసి నడిచేందుకు టీడీపీలో చేరుతున్నట్టు ఈ సందర్భంగా వారు వెల్లడించారు. కుప్పం అభివృద్ధి సీఎం చంద్రబాబుతో సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గతంలో ప్రలోభాలకు గురి చేసిన వైసీపీ పూర్తిగా ఖాళీ కావడం తథ్యమని జోస్యం చెప్పారు.వైసీపీలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం నుంచి రాయలసీమలోని అనంతపురం జిల్లాల వరకు ఆ పార్టీని వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తాజాగా కుప్పంలోని వైసీపీ నేతలు.. ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. ఆ ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు సీట్ల సర్దుబాటుపై చర్చిస్తున్నాయి. అవి మరికొన్ని గంటల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.ఇక విజయనగరం జడ్పీ చైర్మన్, బొత్స సత్యనారాయణ సమీప బంధువు మజ్జి శ్రీను అలియాస్ చిన్న శ్రీను ఇటీవల వైసీపీ వీడారు. అనంతరం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. జిల్లాలోని ఆయన ప్రధాన అనుచరులు కూడా టీడీపీలో చేరిపోయారు. దీంతో జిల్లాలో వైసీపీ పూర్తిగా ఖాళీ అయిపోయిందనే ఓ చర్చ సాగుతోంది. అలాగే అనకాపల్లి, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు తదితర జిల్లాల్లో కూడా వైసీపీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి

విజయవాడ:విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి, సీఎం మహిళాశక్తికి రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ గుర్తింపు తేవడమే మేళా ఉద్దేశం డ్వాక్రా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని వెల్లడి త్వరలో డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు కావాలన్న సీఎం విజయవాడలోని పున్నమి ఘాట్‌లో ‘జాతీయ సరస్ మేళా’ వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలిసారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియాడారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని



ప్రశంసించారు.మహిళా శక్తిని చాటేందుకే విజయవాడలో ఈ మేళాను ఏర్పాటు చేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 650 స్టాళ్లు మహిళల నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ఉత్పత్తులు జాతీయ ఉత్పత్తులుగా మారాలని ఆకాంక్షించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా ఒక చరిత్ర సృష్టిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం డ్వాక్రా సంఘాలు రూ.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుంటూ, లక్ష కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయని, త్వరలోనే ఇది రూ.10 లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. త్వరలోనే పది లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆరు కోట్ల మందిని వ్యాపారవేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆయన స్ఫూర్తి ప్రశంసనీయమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తమ ఆశయమని సీఎం స్పష్టం చేశారు.

వివేకా హత్య కేసు – మరోసారి ఈడీ విచారణకు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి

అమరావతి :మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఈడీ విచారణకు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి మరోసారి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చిన ఆయన్ను ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నిస్తున్నారు. ఈ కేసులో శివశంకర్‌రెడ్డి ఏ5 నిందితుడిగా ఉన్నారు. వివేకా హత్యకు కీలక కుట్రదారులు వెచ్చించాలనుకున్న రూ.40 కోట్లకు సంబంధించిన మూలాలు, ఆ లావాదేవీలతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఉన్న సంబంధాల పైనే ప్రధానంగా విచారణ కొనసాగుతోంది.మరోవైపు మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక కుట్రదారుగా అభియోగాలు ఎదుర్కొంటున్న కడప వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డిని ఈడీ అధికారులు నిన్న(బుధవారం) సుదీర్ఘంగా విచారించారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో దాదాపు 7 గంటలపాటు ఆయన్ను ప్రశ్నించారు. వివేకా



హత్యకు కీలక కుట్రదారులు వెచ్చించాలనుకున్న రూ.40 కోట్ల మూలాలు, ఆ లావాదేవీలతో అవినాష్‌రెడ్డికి ఉన్న సంబంధాల పైనే ప్రధానంగా విచారణ జరిగినట్లు తెలిసింది.హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నారనే అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులకు అడ్వాన్స్‌గా చెల్లించిన కోట్ల సొమ్ము అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డిల నుంచి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి, ఆయన్నుంచి ఎర్ర గంగిరెడ్డి ద్వారా షేక్ దస్తగిరి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డిలకు చేరిందని అనుమానిస్తున్న ఈడీ ఈ కోణంలోనే ఎక్కువ ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది.వాటితో తనకు ఎలాంటి సంబంధమూ లేదంటూ అవినాష్‌రెడ్డి పొంతనలేని సమాధానాలిచ్చారు. దీంతో ఈడీ అధికారులు దర్యాప్తులో సేకరించిన లావాదేవీల ఆధారాలు, పత్రాలు, పలువురు సాక్షులిచ్చిన వాంగ్మూలాలను చూపి ప్రశ్నించినట్లు సమాచారం. విచారణకు అవినాష్‌రెడ్డి పూర్తిస్థాయిలో సహకరించకపోవటంతో నేడూ(గురువారం) విచారణకు హాజరవ్వాలని ఆయన్ను ఆదేశించారు.

వైసీపీ హైకోర్టుకు వెళ్లకుంటే న్యాయం జరిగేది



అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో గొడ్డలి పార్టీ హైకోర్టుకు వెళ్లకపోయి ఉంటే.. బలహీనవర్గాలకు న్యాయం జరిగేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బీసీలకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుంటే కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారంటూ వైసీపీ నేతలపై మండిపడ్డారు. గొడ్డలి పార్టీకి ఈ ఎన్నికలు జరగడం ఇష్టం లేదని విమర్శించారు. ఈ ఎన్నికలు జరిగితే ఉన్న పది మంది కూడా పార్టీ వీడి వెళ్లిపోతారని భయం మొదలైందన్నారు. డెడికేషన్ కమిషన్ రిపోర్ట్ ఇచ్చిందని.. దీనికి కేబినెట్‌లో ఆమోదం తెలిపామని అన్నారు. శనివారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ అయింది. ఈ సమావేశం ముగిసిన తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల జరగనున్నాయని చెప్పారు. 20 శాతం ఉన్న రిజర్వేషన్లను 34 శాతానికి సీఎం చంద్రబాబు పెంచారని వివరించారు. గత ప్రభుత్వం రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీకి బలహీనవర్గాలు అంటే చిన్నచూపు అంటూ మండిపడ్డారు. 2019లో బీసీలపై జరిగిన దమనకాండ గతంలో ఎప్పుడూ చూడలేదని చెప్పారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని అన్నారు. తామిచ్చిన జీవోలపై హైకోర్టుకు వెళ్లకుంటే.. ఇప్పటికే స్థానిక ఎన్నికలు జరిగి ఉండేవని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

విజయవాడలో పేలుడు పదార్థాల కలకలం.. ఆర్‌టీసీ బస్సులో వెలుగు చూసిన వైనం

విజయవాడ: విజయవాడ (కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ఓ బస్సులో పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. నరసారావుపేట నుంచి వచ్చిన ఆర్‌టీసీ బస్సులో ఓ ప్రయాణికుడి అప్రమత్తతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ విషయం నగరంలో కలకలం రేపడంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళనకు గురయ్యాయి.ఉత్తరప్రదేశ్‌కు



చెందిన ఆసిఫ్ అలీ అనే వ్యక్తి నరసారావుపేట నుంచి విజయవాడకు బస్సులో వచ్చాడు. బస్సు దిగిన తరువాత తన బ్యాగుకు బదులు వేరే బ్యాగును తీసుకున్నాడు. తర్వాత ఆ బ్యాగును తెరిచిచూడగా అందులో పేలుడు పదార్థాలు కనిపించాయి. షాక్‌కు గురైన అతడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు.రంగంలోకి దిగిన కృష్ణలంక పోలీసులు బ్యాగును స్వాధీనం చేసుకుని పరిశీలించారు. బ్యాగులో 50 డిటోనేటర్లు, 46 జిలెటిన్ స్టిక్స్‌లు ఉన్నట్లు గుర్తించారు. బాంబ్, డాగ్ స్క్వాడ్లను రప్పించి బస్సుతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను తనిఖీ చేశారు. కృష్ణలంక ఎస్సై గిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ పేలుడు పదార్థాలను ఎవరు తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీలు, ప్రయాణికుల వివరాలను పరిశీలిస్తున్నారు. నగరంలో భద్రతను పెంచారు.

వర్షాభావ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి

అమరావతి: ల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, రాష్ట్రంలో వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎస్ సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రానున్న ఆరు నెలల పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి చోరీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు.తాగునీటి మళ్లింపుపై కఠిన చర్యలు: మంచి నీటిని కేవలం తాగేందుకు



మాత్రమే ఉపయోగించాలని, ఇతర అవసరాలకు గానీ, చేపలు, రొయ్యల చెరువులకు గానీ మళ్లించకుండా కఠిన నిఘా ఉంచాలని సీఎస్ ఆదేశించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే తక్షణమే వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రానున్న ఆరు నెలల కాలం అత్యంత కీలకమైనదని, తాగునీటి సరఫరాపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు ప్రస్తుత తాగునీటి పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించామని, ఆయా చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు సీఎస్ వివరించారు.రీసర్వే, గృహ నిర్మాణాల వేగవంతం: తాగునీటితో పాటు రాష్ట్రంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను సీఎస్ సమీక్షించారు. రీసర్వే వివిధ దశల్లో ఉందని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకాల కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు త్వరగా ఇళ్లు అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.సంజీవని ఆరోగ్య సేవలకు సన్నద్ధం: రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ‘సంజీవని’ ఆరోగ్య సేవల పరిధిని విస్తరించడానికి అన్ని జిల్లాలు సన్నద్ధం కావాలని సీఎస్ పిలుపునిచ్చారు. ఈ వైద్య సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మందులు, సిబ్బందిని ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, కలెక్టర్లను ఆదేశించారు.

జనరల్ న్యూస్

టీ20ల్లోనే అభిషేక్ శర్మ షాకింగ్ రికార్డ్..



టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో ఓ అరుదైన గణాంకం నమోదైంది. 24 బంతులు ఎదుర్కొన్న అభిషేక్ 29 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేట్ 120.83గా నమోదైంది. కనీసం 20 బంతులు ఎదుర్కొన్న టీ20 ఇన్నింగ్స్‌లను పరిగణనలోకి తీసుకుంటే, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అభిషేక్ శర్మకు ఇదే అత్యల్ప స్ట్రైక్ రేట్.

24 బంతుల్లో 29 పరుగులు..

వెస్టిండీస్‌తో హైదరాబాద్ వేదికగా జరిగిన నాలుగో టీ20లో అభిషేక్ శర్మ తన సహజమైన దూకుడైన బ్యాటింగ్‌కు భిన్నంగా ఆడాడు. మొత్తం 24 బంతులు ఎదుర్కొని 29 పరుగులు చేశాడు. దీంతో అతడి స్ట్రైక్ రేట్ 120.83గా నమోదైంది. కనీసం 20 బంతులు ఎదుర్కొన్న అతడి టీ20 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లను పరిశీలిస్తే ఇదే అత్యల్ప స్ట్రైక్ రేట్ కావడం విశేషం.గత రికార్డు కూడా ఆస్ట్రేలియాపైనే..

అభిషేక్ శర్మకు ఇంతకుముందు అత్యల్ప స్ట్రైక్ రేట్ నమోదైన ఇన్నింగ్స్ ఆస్ట్రేలియాపై వచ్చింది. 2025లో క్యారారాలో జరిగిన మ్యాచ్‌లో అతడు 21 బంతుల్లో 28 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో అతడి స్ట్రైక్ రేట్ 133.33గా ఉంది. ఇప్పుడు వెస్టిండీస్‌పై హైదరాబాద్‌లో 29 పరుగులు చేసినా, 24 బంతులు ఆడటంతో అతడి స్ట్రైక్ రేట్ 120.83కు పడిపోయింది.

ఇదే జాబితాలో మూడో స్థానంలో దక్షిణాఫ్రికాపై అహ్మదాబాద్‌లో 2025లో చేసిన 34 పరుగుల ఇన్నింగ్స్ ఉంది. 21 బంతుల్లో 34 పరుగులు చేసిన అభిషేక్ 161.90 స్ట్రైక్ రేట్ సాధించాడు.సాధారణంగా దూకుడైన బ్యాటర్‌గా గుర్తింపు..

అభిషేక్ శర్మ టీ20 క్రికెట్‌లో వేగంగా పరుగులు చేయగల బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. పవర్‌ప్లేలో బౌండరీలు సాధించడం, బౌలర్లపై ఒత్తిడి పెంచడం అతడి బ్యాటింగ్‌లో ప్రధాన బలం

అయితే ప్రతి మ్యాచ్‌లో ఒకే వేగంతో పరుగులు చేయడం సాధ్యం కాదు. పరిస్థితులకు అనుగుణంగా కొన్నిసార్లు ఎక్కువ బంతులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హైదరాబాద్ మ్యాచ్‌లో నమోదైన 24 బంతుల్లో 29 పరుగుల ఇన్నింగ్స్ కూడా అదే కోణంలో చూడాల్సి ఉంటుంది.అయితే గణాంకాల పరంగా మాత్రం ఇది అభిషేక్ శర్మ టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో కనీసం 20 బంతులు ఎదుర్కొన్న ఇన్నింగ్స్‌లలో అత్యల్ప స్ట్రైక్ రేట్గా నిలిచింది.

కాసుల వర్షం కురిపించిన కండోమ్ కంపెనీ షేర్లు..



భారత స్టాక్ మార్కెట్‌లో కొన్ని కంపెనీల షేర్లు దీర్ఘకాలంలో అద్భుతమైన రాబడులను అందిస్తూ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. అలాంటి కంపెనీల్లో ఒకటి. కండోమ్‌లు, ఇతర నిరోధక ఉత్పత్తులను తయారు చేసే ఈ కంపెనీ షేరు గత పదేళ్లలో సుమారు 14,057 శాతం రాబడిని అందించినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఈ స్టాక్ మరోసారి మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది.

కుపిడ్ లిమిటెడ్ అంటే ఏమిటి?కుపిడ్ లిమిటెడ్ భారతదేశానికి చెందిన ఒక తయారీ సంస్థ. ఈ కంపెనీ పురుషుల కండోమ్‌లు, మహిళల కండోమ్‌లు, నీటి ఆధారిత లూబ్రికెంట్ జెల్లీ, వైద్య పరీక్షలకు ఉపయోగించే ×ుణ కిట్లను తయారు చేస్తుంది. కంపెనీకి స్వంత పరిశోధన, అభివృద్ధి కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ తన ఉత్పత్తులను విక్రయిస్తోంది.పదేళ్లలో 14,057 శాతం రాబడి.. ఎంత పెరిగింది?కుపిడ్ లిమిటెడ్ షేరు పదేళ్ల కాలంలో సుమారు 14,057 శాతం రాబడిని అందించింది. అంటే, షేరు ధరలో వచ్చిన పెరుగుదల దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు గణనీయమైన లాభాలను అందించింది. అయితే, ఈ రాబడి గత పనితీరుకు సంబంధించినది మాత్రమే. భవిష్యత్తులోనూ ఇదే స్థాయిలో లాభాలు వస్తాయని హామీ లేదు.కుపిడ్ లిమిటెడ్ షేరు బీఎస్‌ఈలో సుమారు 3 శాతం పెరిగి రూ.368 స్థాయిలో కొత్త గరిష్ఠాన్ని తాకింది.కాలవ్యవధి నివేదించిన షేరు పెరుగుదల, రాబడి

ఒక నెలలో సుమారు 28%, ఆరు నెలల్లో 289% కంటే ఎక్కువ, అదే ఒక సంవత్సరంలో 650% కంటే ఎక్కువ, రెండు సంవత్సరాలలో సుమారు 2,121%, మూడు సంవత్సరాలలో సుమారు 8,605%, ఐదు సంవత్సరాలలో సుమారు 15,301% శాతం పెరుగుదల నమోదైనట్లు కంపెనీ నివేదికలు చెబుతున్నాయి. కండోమ్‌లు, ఇతర వ్యక్తిగత ఆరోగ్య ఉత్పత్తులను తయారు చేసే కుపిడ్ లిమిటెడ్ షేరు గత పదేళ్లలో అందించిన భారీ రాబడితో ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించింది. అయితే, గతంలో వచ్చిన లాభాలు భవిష్యత్తులోనూ వస్తాయని చెప్పలేం. పెట్టుబడి పెట్టే ముందు పూర్తి వివరాలను పరిశీలించి, అవసరమైతే ఆర్థిక సలహాదారుని సంప్రదించాలి.బోనస్ షేర్లను ఎప్పుడు, ఎక్కడ ఇచ్చారు?

ఈ కంపెనీ తన వాటాదారులను చాలా సంతోషపెట్టింది. ఈ కంపెనీ మార్చి 2026లో ఒక షేరుకు 4 (1:4) బోనస్ షేర్లను ఇచ్చింది. అంతకుముందు, 2024లో 1:1 నిష్పత్తిలో, 2018లో 5:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇచ్చారు.

ఒప్పో ఎఫ్-సిరీస్ 10 ఏళ్ల పండుగ.. మార్కెట్లోకి అదిరిపోయే ఒప్పో ఖీ35 5జీ సిరీస్ మోడళ్లు!



స్మార్ట్‌ఫోన్ రష్యా మార్కెట్‌లో తనదైన స్టైల్, అత్యాధునిక కెమెరా ఫీచర్లతో మంచి ఆదరణ పొందిన ఒప్పో (ఖ్రూఖా) సంస్థ భారత మార్కెట్‌లో ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. భారత్‌లోకి ఒప్పో ఎఫ్ సిరీస్ అడుగుపెట్టి 10 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కొత్తగా ఖ్రూఖా ఖీ35 ూవతీఅవం స్మార్ట్‌ఫోన్‌లను అధికారికంగా లాంచ్ చేసింది. ఈ లైనప్‌లో ఖ్రూఖా ఖీ35 రెండు పవర్‌ఫుల్ మోడళ్లను పరిచయం చేసింది. 50వీూ అల్ట్రా-వైడ్ గ్రూప్ సెల్ఫీ కెమెరాముఖ్యంగా నేటి తరం యువత, సోషల్ మీడియా క్రియేటర్లు, ఫొటోగ్రఫీ ప్రేమికులను దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ ఫోన్లను డిజైన్ చేసింది. ఇందులో 50 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ ఫ్రంట్ కెమెరాను అందించారు. ఇది 100 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూని ఇస్తుంది. దీనివల్ల గ్రూప్ సెల్ఫీలు దిగినప్పుడు ఎవరూ కట్ అవ్వకుండా ఒకే ఫ్రేమ్‌లో పర్ఫెక్ట్‌గా ఫిట్ అవుతారు. ప్రో మోడల్‌లో ముందు, వెనుక కెమెరాలతో 4ఖ వీడియో రికార్డింగ్ సదుపాయం, ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఖ్రూూ) సపోర్ట్ ఉంది.అద్భుతమైన డిస్‌ప్లే, ప్రాసెసర్‌ప్రీమియం మోడల్ అయిన ఖ్రూఖా ఖీ35 5జీ సిరీస్ మోడళ్లు!

హైదరాబాద్‌లో వెస్టిండీస్ సంచలనం.



హైదరాబాద్‌లో జరిగిన నాలుగో టీ20లో వెస్టిండీస్ అద్భుత విజయం సాధించింది. భారీ స్కోరు సాధించిన వెస్టిండీస్, భారత్‌ను 24 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 247/3 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో భారత్ 223 పరుగులకు ఆలౌటైంది. షాయ్ హోప్ సెంచరీతో మెరిసిన ఈ మ్యాచ్‌లో కీమో పాల్ బౌలింగ్‌తో మ్యాచ్‌ను పూర్తిగా మార్చేశాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమమైంది.షాయ్ హోప్ అజేయ సెంచరీ.. వెస్టిండీస్ భారీ స్కోరుటాస్ ఓడిపోయి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌కు కెప్టెన్ షాయ్ హోప్ (ాశ్త్రుఱ ఎశీజూవ) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 50 బంతులు ఎదుర్కొన్న హోప్ నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేశాడు.ఈ సిరీస్‌లో హోప్‌కు ఇది రెండో సెంచరీ కావడం విశేషం. రాంచీలో జరిగిన రెండో టీ20లోనూ అతడు శతకం సాధించాడు. మరోవైపు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆశలు రేపాడు. 23 బంతుల్లోనే ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్ల సాయంతో 56 పరుగులు చేశాడు.సంజుకు తోడుగా తిలక్ వర్మ (అశ్రీుఎ ఱుతీఱు) 43 పరుగులు, నితీష్ రెడ్డి (చిఱ్ఱఅంష్ట్ర =వనఎ) 41 పరుగులు చేశారు. వీరి ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యానికి చేరువయ్యే ప్రయత్నం చేసింది.అయితే వెస్టిండీస్ బౌలర్లు కీలక సమయంలో భారత బ్యాటర్లను పెవిలియన్‌కు పంపించారు. ముఖ్యంగా కీమో పాల్ (ఖవవఎశీ్రఖబశ్రీ) అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు దీంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. భారత్ తరఫున ప్రిన్స్ యాదవ్ (ూతీఅఅఎవ్ఘఱుజ), అక్షర్ పటేల్ (ూఇఱుతీ్రఖ్ఞవశ్రీ), అర్ష్‌దీప్ సింగ్ (ూతీంష్ట్రనవవజూ ాఅఅష్ట్రష్ట్ర) తలో వికెట్ పడగొట్టారు.సంజు సామ్సన్ మెరుపులు.. అయినా భారత్‌కు ఓటమి..247 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ దూకుడుగా ఆడే ప్రయత్నం చేసింది. సంజు సామ్సన్ (ాుఅయబ ాుఎంశీఅ)

రూ. 5 కోట్లు నష్టపోయిన టీమిండియా ప్లేయర్..!



సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆసక్తికరమైన వార్త. జట్టు మాజీ పేసర్ టీ. నటరాజన్ మరోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ లోకి అడుగుపెట్టనున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ట్రేడ్‌లో భాగంగా నటరాజన్‌ను హైదరాబాద్ ఫ్రాంచైజీ తిరిగి తీసుకుంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ తమ ఆటగాళ్లను ట్రేడ్ చేసుకున్నా యి. ఈ డీల్‌లో భాగంగా ఢిల్లీ బౌలర్ నటరాజన్ ూ=ఎలోకి రాగా.. ూ=ఎకు చెందిన లెగ్ స్పిన్నర్ అనారీ ఢిల్లీ జట్టులోకి వెళ్లినట్లు సమాచారం.2020 నుంచి 2024 వరకు ూ=ఎతో నటరాజన్‌నటరాజన్ గతంలో 2020 నుంచి 2024 వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కొనసాగాడు. ఈ కాలంలో జట్టు బౌలింగ్ విభాగంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 2024 సీజన్‌లో తన బౌలింగ్‌తో సత్తా చాటాడు. 2024 ఖ్రూూ సీజన్‌లో 19 వికెట్లు తీసుకున్న నటరాజన్‌పై ఫ్రాంచైజీల ఆసక్తి పెరిగింది. ఆ తర్వాత జరిగిన 2025 వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.10.75 కోట్లకు దక్కించుకుంది.రూ.10.75 కోట్ల నుంచి రూ.5 కోట్లకు..ఢిల్లీ క్యాపిటల్స్ కోసం ఆడిన తర్వాత ఇప్పుడు నటరాజన్ మళ్లీ తన పాత జట్టు ూ=ఎకు చేరుతున్నాడు. ఈసారి సన్‌రైజర్స్ అతడిని రూ.5 కోట్లకు తిరిగి తీసుకున్నట్లు సమాచారం. అంటే 2025 వేలంలో ఢిల్లీ చెల్లించిన రూ.10.75 కోట్లతో పోలిస్తే, ఇప్పుడు ూ=ఎ అతడిని తక్కువ మొత్తానికే జట్టులోకి తీసుకొచ్చింది. దీంతో హైదరాబాద్ ఫ్రాంచైజీ పాత ఆటగాడిపై మరోసారి నమ్మకం ఉంచినట్లు కనిపిస్తోంది.ూ=ఎ బౌలింగ్‌కు మరింత బలం?నటరాజన్ తిరిగి రావడం సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ విభాగానికి ఉపయోగపడే అవకాశం ఉంది. గతంలో ూ=ఎ తరఫున ఆడిన అనుభవం కూడా అతడికి ఉంది. 2024లో 19 వికెట్లతో చూపించిన ప్రదర్శనను మళ్లీ కొనసాగిస్తే జట్టుకు కీలక బౌలర్‌గా మారే అవకాశం ఉంది.మరోవైపు ఈ ట్రేడ్‌తో ూ=ఎకు చెందిన లెగ్ స్పిన్నర్ అనారీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి వెళ్లనున్నాడు. దీంతో రెండు ఫ్రాంచైజీలు తమ అవసరాలకు అనుగుణంగా ఆటగాళ్లను మార్చుకున్నాయి. సన్‌రైజర్స్ అభిమానులకు మాత్రం పాత పరిచయమైన నటరాజన్ మళ్లీ ఆరెంజ్ జెర్సీలో కనిపించనున్నాడనే వార్త ప్రత్యేక ఆకర్షణగా మారింది.


ఈ 4 సంకేతాలు కనిపిస్తే జాగ్రత్త.



. ఎస్‌బీఐ హెచ్చరిక.. అవేంటో తెలుసా..? సోషల్ మీడియా, వాట్సాప్, టెక్స్ట్ మెసేజ్‌లు లేదా ఈమెయిల్‌ల ద్వారా మీకు నెలకు 30% రాబడి ఇస్తామన్న ఆఫర్లు వస్తుంటే జాగ్రత్తగా ఉండండి. ఇలాంటి ఆకర్షణీయమైన వాగ్దానాలు గణనీయమైన ఆర్థిక నష్టాలకు దారితీయవచ్చు. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన ఎస్‌బిఐ, మోసపూరిత పెట్టుబడి పథకాల గురించి పెట్టుబడిదారులను హెచ్చరించింది. త్వరితగతిన, అధిక లాభాలు ఇస్తామని ఆశ చూపి సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని దోచుకోగలరని ఆ బ్యాంకు పేర్కొంది. అందువల్ల ఏదైనా పెట్టుబడి ఆఫర్‌ను నమ్మే ముందు దాని ప్రామాణికతను ధృవీకరించుకోవడం చాలా ముఖ్యం. దీని గురించి వివరంగా తెలుసుకుందాం.ఎస్‌బీఐ ఎందుకు హెచ్చరిక జారీ చేసింది?

అక్టోబర్ 12న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్ ద్వారా ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ూదీ× పెట్టుబడిదారులకు సూచించింది. ఈ సందేశం బ్యాంకు 'జాతీయ సైబర్ భద్రతా మాసోత్సవ ప్రత్యేక ప్రచారం 6.0'లో భాగంగా ఉంది . నెలకు 30% రాబడి వంటి వాగ్దానాలు మోసం కావచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. మోసగాళ్లు తక్కువ సమయంలో ధనవంతులు కావాలనే కలలతో ప్రజలను ఆకర్షించి, ఆ తర్వాత పెట్టుబడి పేరుతో డబ్బు బదిలీ చేసేలా వారిని మోసం చేస్తారు. అటువంటి పరిస్థితిలో పెట్టుబడిదారులు తొందరపడకుండా ఆ ఆఫర్ విశ్వసనీయతను తనిఖీ చేసుకోవాలి.. విశ్వసనీయమైన ఆర్థిక మార్గాలను మాత్రమే ఉపయోగించాలి.సైబర్ నేరగాళ్లు ఎలా పనిచేస్తారు?

సైబర్ నేరగాళ్లు ప్రజలను వలలో వేయడానికి రకరకాల పద్ధతులను ఉపయోగిస్తారు. కొన్నిసార్లు వారు సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలను ప్రదర్శిస్తారు, మరికొన్నిసార్లు గుర్తుతెలియని నంబర్ల నుండి పెట్టుబడి ఆఫర్లను అందిస్తూ సందేశాలు పంపుతారు. కొన్ని సందర్భాల్లో వారు నకిలీ వెబ్‌సైట్లు, మోసపూరిత పెట్టుబడి యాప్‌లు, కల్పిత కస్టమర్ రివ్యూల ద్వారా ప్రజల నమ్మకాన్ని పొందడానికి ప్రయత్నిస్తారని, ఇలాంటివి నమ్మితే



ఆ సినిమా ఫ్లాప్ కావడంతో వారు బాగా ఎంజాయ్ చేశారు..

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హీరో విజయ్ దేవరకొండ ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'ఈ రోజు ఈవెంట్ కు వచ్చిన నా డైరెక్టర్స్ అందరికీ థ్యాంక్స్. వాళ్లలో కొందరితో వర్క్ చేశా. మరికొందరితో చేయబోతున్నా. మీలాంటి మంచి డైరెక్టర్స్ వల్లే నేను రోజూ హ్యాపీగా షూట్ కు వెళు న్నా. తిరుపతి బ్రహ్మోత్సవాలు, తెలంగాణలో బతుకమ్మ పండుగ, విజయవాడలో ఉత్సవాలు మొదలయ్యాయి, పిల్లలకు హాలీడేస్ మొదలయ్యాయి. అంతటా ఒక పండుగ వైబ్ ఉంది. ఈ నెల 16న తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా రణబాలి వస్తోంది. రాహుల్ తన నెక్స్ట్ మూవీ రూరల్ పీరియాడిక్ యాక్షన్ మూవీ చేయాలనుకున్నప్పుడు ఆయన ఊరికి వెళ్లి అక్కడ కథలు వింటూ, జాతరలు, పండుగలు చూస్తూ. ఆ జాతరలో చెప్పే బుర్రకథలు, జానపదాలు వింటూ అందులోని వీరుల గురించి తెలుసుకున్నాడు. వాటి నుంచి ఒక భారీ నేపథ్యమున్న సినిమాను ఊహించాడు. ఈ సినిమా గురించి వర్క్ చేస్తుంటే చరిత్రలో దాచిన కొన్ని అధ్యాయాల గురించి రాహుల్ తెలుసుకున్నాడు. అప్పుడు ఈ రణబాలి సినిమాకు ఒక గొప్ప పర్పస్ ఏర్పడింది. రాహుల్ నాతో ఒక రూరల్ మాస్ సినిమా చేసినా, ఒక హిస్టారికల్ యాక్షన్ సినిమా చేసినా ఇంత మజా వచ్చి ఉండేది కాదేమో. రాహుల్ తను చెప్పాలనుకున్న పీరియడ్ యాక్షన్ ఫిలిం, ఒక పర్పస్ ఫుల్ ఎలిమెంట్ ఏదీ వదలకుండా బ్యూటిఫుల్ గా స్క్రిప్ట్ చేసి రణబాలి సినిమా రూపొందించాడు. రాహుల్ తన కెరీర్ కొనసాగించడానికి సినిమాలు చేయడు, కొన్ని గొప్ప కథలు చెప్పేందుకు సినిమాలు రూపొందిస్తాడు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గారు సూపర్ ఎల్ నినో ప్రభావం గురించి చెప్పారు. ప్రజల్ని జాగ్రత్తగా ఉండమన్నారు. సరిగ్గా 150 ఏళ్ల క్రితం సూపర్ ఎల్ నినో వచ్చింది. అదే గ్రేట్ మద్రాస్ ఫామైన్.



రాజా సాబ్ ఫెయిల్యూర్ పై నిర్మాత రియాక్షన్..

నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ ఇటీవల గరివిడి లక్ష్మి సినిమా ప్రమోషన్లలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. తన నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ (పీఎంఎఫ్) ప్రయాణం, ముఖ్యంగా రాజాసాబ్ చిత్రం వైఫల్యంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పీఎంఎఫ్ కెరీర్‌లో రాజాసాబ్ అతిపెద్ద నిరాశను మిగిల్చిందని ఆయన అంగీకరించారు. అయితే, ఈ అనుభవం నుండి చాలా విషయాలు నేర్చుకున్నట్లు పేర్కొన్నారు. పీఎంఎఫ్ గతంలో ఎమ్మెల్యే, గూఢచారి 2, గూఢచారి, వెంకీ మామ, ఓ బేబీ, కార్తికేయ 2, ధమాకా వంటి అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించింది. ఈ చిత్రాలు కొన్ని నిర్దిష్ట కమర్షియల్ ఫార్ములాతో విజయవంతమయ్యాయని విశ్వ ప్రసాద్ తెలిపారు. మంచి దర్శకుడు, నటుడు, కొన్నిసార్లు కాంబినేషన్‌కు మించి బడ్జెట్ కేటాయించడం వంటి అంశాలతో సక్సెస్‌ను సాధించామని వివరించారు. అయితే, గత జనవరి తర్వాత పరిస్థితులు మారాయని, ఓటీటీ ప్రభావం, క్రమశిక్షణ లేకపోవడం వంటి కారణాల వల్ల కొన్ని చిత్రాలు నష్టాలను చవిచూశాయని ఆయన పేర్కొన్నారు. 2024, 2025లో ఈ తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు.రాజాసాబ్ వైఫల్యానికి గల కారణాలను వివరిస్తూ, సినిమా తప్పుడు సీజన్‌లో విడుదల కావడం ఒక ప్రాథమిక లోపంగా ఆయన అన్నారు. వేరే సమయంలో విడుదలై ఉంటే సినిమా ఫలితం భిన్నంగా ఉండేదని ఆయన బలంగా నమ్ముతున్నట్లు తెలిపారు. సీజన్‌తో పాటు, విడుదల రోజున ఎదురైన సమస్యలు కూడా చిత్రానికి ప్రతికూలంగా మారాయి. ప్రీమియర్‌లు ఆలస్యం కావడం, టికెట్ ధరలను పెంచడానికి ప్రయత్నించడం వంటివి ప్రేక్షకుల ఆగ్రహానికి కారణమయ్యాయి. టికెట్ ధరల పెంపు అనేది తాము చేసిన మొదటి ప్రయత్నమని, అది చేయకుండా ఉండాల్సింది అని ఆయన పేర్కొన్నారు. ఈ కారణాలన్నీ కలసి రాజాసాబ్ చిత్రానికి ఆశించిన విజయాన్ని దూరం చేశాయని తెలిపారు.అలాగే, ప్రభాస్ నటించిన "స్పిరిట్" చిత్రానికి సంబంధించిన తెలుగు హక్కులు పీఎంఎఫ్ వద్ద ఉన్నాయని, దానితో రాజాసాబ్ లోటును పూడ్చుకుంటారా అని అడగ్గా.. తాను ఆ చిత్రానికి కేవలం డిస్ట్రిబ్యూటర్‌ను మాత్రమేనని విశ్వ ప్రసాద్ స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూటర్‌గా సినిమాకు ఉత్తమమైన విడుదల సైజు, స్క్రీన్‌ను అందించడంలో రాజాసాబ్ విషయంలోనూ తాము విజయవంతమయ్యామని గుర్తు చేశారు.



నేను కాళ్లు పట్టుకోమన్నానా..! షాలినీ, శివ్ మధ్య వివాదం

బిగ్ బాస్ తెలుగు 9 హౌస్‌లో ఆరోవారం కెప్టెన్సీ పోటీ రసవత్తరంగా మారింది. ఈసారి వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్లకు బిగ్ బాస్ ప్రత్యేక అవకాశాన్ని ఇచ్చాడు. కెప్టెన్సీ పోటీదారులుగా నిలిచే ఛాన్స్ కల్పించడంతో పాటు, తమ పాయింట్లను కాపాడుకుంటూ ఇతర టీమ్‌ల స్కోర్‌ను తగ్గించుకునేలా కొత్త టాస్క్‌ను ఇచ్చాడు. దీంతో హౌస్‌లోని పాత కంటెస్టెంట్లపై వైల్డ్ కార్డ్ ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారనే విషయం ఆసక్తికరంగా మారింది. హౌస్‌లో ఇప్పటికే ఉన్న ఓజీ కంటెస్టెంట్ల ఆటతీరును బయట నుంచి గమనించిన వైల్డ్ కార్డ్ సభ్యులకు బిగ్ బాస్ ఓ ప్రత్యేక టాస్క్ ఇచ్చాడు. ఒక్కో కంటెస్టెంట్ ప్రవర్తనకు సరిపోయే లక్షణాలను గుర్తించి వారికి తగిన ట్యాగులు ఇవ్వాలని సూచించాడు. ఈ అభిప్రాయాల ఆధారంగా ప్రత్యర్థి టీమ్ పాయింట్లను తగ్గించుకోవడంతో పాటు, తమ స్కోర్‌ను పెంచుకునే అవకాశం కల్పించాడు.ఈ క్రమంలో శ్వేత నాయుడు.. రోహిత్‌కు డ్రామా కింగ్ అనే ట్యాగ్ ఇచ్చింది. త్రిగుణ్‌కు మానిప్యులేటర్, రామ్ ప్రసాద్‌కు కన్నింగ్, దేబ్జానీకి సేఫ్ ప్లేయర్, ఝాన్సీకి బ్యాక్ స్టాబర్, షాలినీకి విక్టిమ్ కార్డ్ అనే ట్యాగులను వైల్డ్ కార్డ్ టీమ్ ఎంపిక చేసింది. దీంతో ఈ టాస్క్‌లో ఎవరెవరు సరైన అంచనాలు వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వైల్డ్ కార్డ్స్ ఇచ్చిన ట్యాగులు, ఓజీ కంటెస్టెంట్ల అంచనాలతో టాస్క్ ప్రారంభమైంది. మొదటి బజర్‌లో సుధీర్, వంశీ పోటీపడ్డారు. ఈ రౌండ్‌లో సుధీర్ ముందుగా రియాక్ట్ అయినప్పటికీ, అతను ఎంచుకున్న సమాధానం తప్పు కావడంతో పాయింట్ దక్కలేదు. మరోవైపు ఝాన్సీకి బ్యాక్ స్టాబర్ ట్యాగ్ ఇచ్చినట్లు శివ్ వెల్లడించాడు.ఇక త్రిగుణ్‌కు 'మానిప్యులేటర్' అనే ట్యాగ్ ఇచ్చారని వంశీ కరెక్ట్‌గా గుర్తించి తన టీమ్‌కు పాయింట్ సాధించిపెట్టాడు. అలాగే షాలినీకి 'విక్టిమ్ కార్డ్' అనే ట్యాగ్ ఇచ్చిన విషయాన్ని రామ్ ప్రసాద్ కూడా సరిగ్గా అంచనా వేశాడు. ఇలా టాస్క్ సాగుతున్న కొద్దీ కంటెస్టెంట్ల మధ్య ఉన్న అభిప్రాయాలు బయటపడటంతో హౌస్‌లో ఆసక్తి పెరిగింది.ఈ టాస్క్‌లో షాలినీకి 'విక్టిమ్ కార్డ్' అనే ట్యాగ్ ఇవ్వడంపై శివ్ తన అభిప్రాయాన్ని వినిపించాడు. నీతూ విషయంలో షాలినీ అతిగా స్పందించిందని తనకు అనిపించిందని చెప్పాడు.

ఫౌజీ' హీరోయిన్ బర్త్ డే.. రుచికరమైన వంటకాలతో ప్రభాస్ సర్‌ప్రైజ్..



పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ మంచి భోజన ప్రియుడన్న సంగతి అందరికి తెలిసిందే. ఆయన తినడమే కాదు, ఆయనతో పాటుగా ఉండేవారికి కూడా రుచికరమైన వంటకాలు అందిస్తుంటారు డార్లింగ్. ముఖ్యంగా ఆయనతో పని చేసే నటీనటులకు ఇంటి నుంచి మంచి రుచికరమైన భోజనం తినిపిస్తారు. ఒకటి కాదు.. రెండు కాదు.. లెక్కలేనన్నీ వెరైటీలతో నాన్ వెజ్ వంటకాలు, స్వీట్స్.. ఇలా ఎన్నో రకాల ఫుడ్ ఐటమ్స్ సెట్ కు తీసుకొచ్చి మరీ అందరికీ తినిపిస్తుంటారు. అందుకే ప్రభాస్ ఆతిథ్యం గురించి సినిమా ఇండస్ట్రీలో ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. బాలీవుడ్, కోలీవుడ్, శాండల్ వుడ్, మాలీవుడ్.. ఇలా అన్ని రకాల ఇండస్ట్రీల హీరోలు, హీరయిన్లు, యాక్టర్స్ ప్రభాస్ ఆతిథ్యం రుచి చూసిన వారే. ఇప్పుడు తాజాగా తన రుచికరమైన విందుతో హీరోయిన్ ఇమాన్విని సర్‌ప్రైజ్ చేశారు ప్రభాస్. వివరాల్లోకి వెళితే.. క్రియేటివ్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా 'ఫౌజీ'. పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమాతో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఇమాన్వీ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. మంగళవారం(అక్టోబర్ 13) ఆమె తన పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, సినీ అభిమానులు, నెటిజన్లు ఇమాన్వీకి బర్త్ డే విషెస్ చెప్పారు. ఫౌజీ మేకర్స్ కూడా ఓ స్పెషల్ పోస్టర్ తో ఈ బ్యూటీకి బర్త్ డే విషెస్ చెప్పారు.ఇక ప్రభాస్ కూడా తన దైన స్టైల్ లో ఇమాన్వికి బర్త్ డే ట్రీట్ అందించారు. ఆమె కోసం తన ఇంటి నుంచి రకరకాల వెరైటీ వంటకాలు పంపించారు. ఈ విషయాన్ని ఇమాన్వి సోషల్ మీడియాలో పంచుకుంది. 'మనసు, కడుపు రెండూ ఎప్పటికీ నిండుగానే ఉంటాయి. థ్యాంక్యూ ప్రభాస్ గారు' అని ప్రభాస్ కు స్పెషల్ గా థ్యాంక్స్ చెప్పింది ఇమాన్వీ. ఇదే సందర్భంగా ప్రభాస్ పంపిన వంటకాలకు సంబంధించిన ఫొటో, వీడియోని అభిమానులతో పంచుకుందీ అందాల తార. టేబుల్ పై ఉన్న ఫుడ్ వెరైటీలన్నీ అందులో చూపించింది. ప్రస్తుతం ఇమాన్వీ షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



మూడేళ్లు ఆ డైరెక్టర్ ఇంటి చుట్టూ తిరిగా.. నెలకు రూ.50 వేల జాబ్ కూడా వదిలేసా..

సినిమా రంగంలో సక్సెస్ సాధించిన ప్రతి దర్శకుడి వెనుకా ఒక ఆసక్తికరమైన ప్రయాణం ఉంటుంది. తెరపై కనిపించే పేరు, క్రేజ్ రావడానికి ముందు ఎన్నో అవమానాలు, ఎదురుచూపులు, రిజెక్షన్స్ ఎదుర్కొన్నవాళ్లు చాలామందే ఉన్నారు. అలాంటి కష్టాల నుంచి దర్శకుడిగా ఎదిగిన వారిలో శ్రీకాంత్ ఓదెల ఒకరు. దసరా, ది ప్యారడైజ్ వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోజులను తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. శ్రీకాంత్ ఓదెలకు చిన్నప్పటి నుంచే సినిమా అంటే ఆసక్తి. అయితే దర్శకుడిగా మారాలనే లక్ష్యంతో ఆయన వేసిన తొలి అడుగులు అంత సులభంగా సాగలేదు. ముఖ్యంగా తనకు ఎంతో ఇష్టమైన దర్శకుడు సుకుమార్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయాలనే కోరికను నెరవేర్చుకోవడానికి చాలా కాలం ప్రయత్నించారట.ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో శేషు అనే లెక్చరర్ ద్వారా సుకుమార్‌తో పరిచయం ఏర్పడే అవకాశం లభించిందని శ్రీకాంత్ తెలిపారు. ఆ పరిచయాన్ని ఉపయోగించుకుని సుకుమార్ టీమ్‌లో చేరేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పట్లో అవకాశం దక్కలేదట. 'ఆర్య 2' తర్వాత అన్నపూర్ణ స్టూడియోలో సుకుమార్‌ను కలిసినట్లు శ్రీకాంత్ వెల్లడించారు. అప్పటి నుంచి ఆయన దగ్గర పనిచేయాలనే పట్టుదల మరింత పెరిగిందట. అవకాశం కోసం ఏకంగా మూడేళ్ల పాటు సుకుమార్ ఇంటి చుట్టూ తిరిగినట్లు చెప్పారు.రోజూ ఉదయం అపార్ట్‌మెంట్ దగ్గరకు వెళ్లి సుకుమార్‌ను



ఆరోవారం ఓటింగ్‌లో దుమ్మురేపుతోన్న రోహిత్.. డేంజర్ జోన్‌లో ఆ ఇద్దరు..

బిగ్ బాస్ ఇంట్లో మూడో వారం కెప్టెన్సీ కంటెండర్ టాస్కులు ఆసక్తికరంగా సాగుతున్నాయి. కంటెస్టెంట్ల మధ్య పోటీ, గొడవలు, భావోద్వేగాలు ఒకవైపు కొనసాగుతుండగా.. మరోవైపు ఇంటి సభ్యుల ఆటతీరుపై బయట ప్రేక్షకుల్లో ఉన్న అభిప్రాయాలను బిగ్ బాస్ స్క్రీన్‌పై చూపించడం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా షాలినీ, రాం ప్రసాద్, త్రిగుణ్, వర్షిణి, సుధీర్‌లపై వచ్చిన కామెంట్లు ఇంట్లో చర్చకు దారితీశాయి. కెప్టెన్సీ కంటెండర్ టాస్కుల్లో భాగంగా రెండు బజర్‌లను ముందుగా ఎవరు టచ్ చేశారనే దానిపై నరేష్, వంశీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని తేల్చే బాధ్యత త్రిగుణ్‌పై పడింది. మొదట నరేష్ ముందుగా బజర్ పట్టుకున్నాడని చెప్పిన త్రిగుణ్.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. చివరకు వంశీనే ముందుగా బజర్ టచ్ చేశాడని ప్రకటించాడు. ఒకవేళ తన నిర్ణయం తప్పయితే దానికి తానే బాధ్యత వహించి పనిష్మెంట్ తీసుకుంటానని త్రిగుణ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది.
మరో టాస్క్‌లో వంశీ, ఝాన్సీ పోటీ పడగా.. ఝాన్సీ విజయం సాధించింది. దీంతో ఆమెకు కెప్టెన్సీ కంటెండర్‌గా నిలిచే అవకాశం రావడంతో పాటు ఫ్యామిలీ ఫోటోను పొందే ఛాన్స్ కూడా దక్కింది. అయితే తనకు లభించిన ఆప్షన్స్‌లో నరేష్‌కు సంబంధించిన లెటర్‌ను ఎంచుకున్న ఝాన్సీ.. దాన్ని ముక్కలు చేయడంతో నరేష్‌కు టెన్షన్ మొదలైంది. తర్వాత కంటెస్టెంట్లకు కాస్త రిలీఫ్ ఇచ్చేలా గార్డెన్ ఏరియాలోకి బిగ్ బాస్ భారీగా ఫుడ్ పంపించాడు. ఇంటి సభ్యులంతా కలిసి ఫుడ్‌ను ఎంజాయ్ చేశారు. కానీ ఆ ఆనందం

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.